
సాక్షి
పల్నాడు
ఆదివారం । 9 । జూన్ । 2024




సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 504.70 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది.



నిమ్మకాయల ధరలు

తెనాలి: తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.5400, గరిష్ట ధర రూ.7400, మోడల్ ధర రూ.6800 వరకు పలికింది.



వేంకటేశ్వరస్వామి కళ్యాణం

గుంటూరురూరల్: గోరంట్ల గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవం శనివారం కనుల పండువగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఆర్టీసీ ఆధ్వర్యంలో డ్రైవింగ్‌లో శిక్షణ

పట్నంబజారు: గుంటూరు జిల్లా పరిధిలోని కారు, జీపు డ్రైవర్లకు సంబంధించి ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో గుంటూరు-2 డిపోలో హెవీ మోటారు వెహికల్ డ్రైవింగ్ స్కూల్ ప్రారంభించినట్లు డిపో-2 మేనేజర్ షేక్ అబ్దుల్ సలాం తెలిపారు. 14వ బ్యాచ్‌కు శిక్షణ ముగిసిన నేపథ్యంలో 15వ బ్యాచ్‌కు అడ్మిషన్లు ప్రారంభించినట్లు తెలిపారు. శిక్షణ పొందేందుకు పరిమితి ప్రకారం 16 మందికి మాత్రమే అవకాశం ఉందని వివరించారు. ప్రతిరోజూ వాహనానికి సంబంధించి భాగాల గురించి తెలియజేయడం, వాటి పనితీరు, పలురకాల రోడ్లు, వాటిపై ప్రయాణం, మార్కింగ్ పలు అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. అలాగే ప్రతిరోజూ ప్రాక్టికల్‌గా ప్రతి ఒక్కరిచేత 15 కిలో మీటర్లు బస్సు నడిపించడం జరుగుతోందన్నారు. పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చి హెవీ డ్రైవింగ్ లైసెన్సు పొందవచ్చన్నారు. మరిన్ని వివరాల కోసం 7382894585 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

అలరించిన వాగ్గేయకారుల కీర్తనలు



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శనివారం సంగీత కదంబ కార్యక్రమం ప్రేక్షకులను ఆకట్టుకుంది. త్యాగరాజ స్వరభారతి సంగీత సభ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య ప్రారంభించారు. దెందుకూరి లలితా రాజ్యలక్ష్మి, బొల్లవరపు రోహిత, బొల్లవరపు సాయి అనుజ్ఞ, అమోలిక వీరబ్రహ్మాలు వాగ్గేయకారుల కీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు. వీణపై కొమాందూరి వెంకట అనంతశయనం, మృదంగంపై తిరునగరం ప్రభాకర్ రావు, తబలాపై పాలుట్ల బాలాజీ వాయిద్య సహకారం అందించారు. దెందుకూరి శ్రీరామమూర్తి, బీవీఎస్ మల్లేశ్వరరావు, సాయి రాఘవేంద్ర వీరబ్రహ్మ, సుభాషిణి దంపతులు హాజరయ్యారు.

11న వీసీ భారతికి సాంబయ్య స్మారక అవార్డు ప్రదానం

నగరంపాలెం: విద్య, వైద్య, కళాసేవా అంశాలతో సీహెచ్ సాంబయ్య స్మారక పరిషత్‌ను స్థాపించినట్లు పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు చిటుమడుగుల భాస్కరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా ప్రదాత సీహెచ్ సాంబయ్య 35వ వర్ధంతి సందర్భంగా పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం (తిరుపతి) ఉప కులపతి దేవురు భారతికి సాంబయ్య స్మారక అవార్డు ప్రదానం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థిని ఆకుల వెంకట నాగసాయిమనస్వికి రూ.10వేలు ప్రోత్సాహక నగదుతో ప్రతిభా పురస్కారం అందిస్తామని తెలిపారు. అనంతరం నాట్య మయూరి లేఖ్యా భరణి బృందం (విజయవాడ)తో నృత్య ప్రదర్శన ఇవ్వనున్నారని అన్నారు. ఈనెల 11న బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

పదవికి రాజీనామా

నరసరావుపేట: ఏపీ స్టేట్ మినిమమ్ వేజేస్ అడ్వైజరీ బోర్డు ఇండిపెండెంట్ సభ్యుడు రామిశెట్టి కొండలరావు తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు శనివారం లేబర్, ఫ్యాక్టరీస్, బాయిలర్స్ విభాగం రాష్ట్ర సెక్రటరీకి రాజీనామా లేఖను పంపించారు. కాగా, కొండలరావుకు ఈ పదవి ఎన్నికల నోటిఫికేషన్‌కు రెండు రోజుల ముందే రావటం గమనార్హం.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న నిత్యాన్నదానానికి ఎన్టీఆర్ జిల్లాకు చెందిన భక్తులు శనివారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరుకు చెందిన శనగవరపు ఆంజనేయ శాస్త్రి దంపతులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.1,00,010 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు.

నామమాత్రం.. నోటాకే నయం

జిల్లాలో ప్రధాన పార్టీల అభ్యర్థులకే భారీగా ఓట్లు

- మిగతా అభ్యర్థులకు కనీస ఓట్లు కూడా రాని వైనం
- కాంగ్రెస్, బీఎస్పీలతో సహా డిపాజిట్లు కోల్పోయిన 93 మంది అభ్యర్థులు
- జిల్లాలో 107 మంది అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ
- ప్రధాన పార్టీలకు చెందిన 14 మందికే డిపాజిట్లు



సత్తెనపల్లి మండలం నందిగామలో క్యూ లైన్‌లో ఉన్న ఓటర్లు(ఫైల్)

సత్తెనపల్లి: జిల్లాలో సార్వత్రిక సమరం నువ్వా .. నేనా అన్నట్లు జరిగింది. ఈ ఎన్నికల్లో మొత్తం 107 మంది అభ్యర్థులు వివిధ పార్టీల నుంచి తలపడ్డారు. ఎన్నికల్లో పోటీ చేసిన 73 మంది అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయారు. కనీసం తమ ఉనికైనా చాటుకో లేకపోయారు. ప్రధాన పార్టీలైన వైఎస్సార్ సీపీ, ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులు మినహా మిగిలిన జాతీయ పార్టీలు సైతం డిపాజిట్లు కోల్పోవడం గమనార్హం. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో ప్రధాన పక్షాలకు తప్ప, కాంగ్రెస్, బీఎస్పీ వంటి పార్టీలతో పాటు స్వతంత్రులు ఎవరికీ డిపాజిట్ దక్కలేదు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 107 మంది బరిలో నిలవగా 14 మంది వైఎస్సార్ సీపీ, ఎన్‌డీఏ కూటమికి చెందిన అభ్యర్థులు ఉన్నారు. మిగిలిన 93 మందికి డిపాజిట్లు దక్కలేదు. వీరంతా కాంగ్రెస్, బీఎస్పీ, చిన్న పార్టీలు, స్వతంత్రులు ఉన్నారు. జిల్లాలో నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే ఇలా ..

- చిలకలూరిపేట నియోజకవర్గంలో ప్రత్తిపాటి పుల్లారావు (ఎన్‌డీఏ కూటమి)కు 1,11,062, కావటి శివనాగ మనోహర్ నాయుడు (వైఎస్సార్ సీపీ)కు 77,800, మద్దుల రాధాకృష్ణ (కాంగ్రెస్)కు 2,270, కొప్పుల బాబూరావు (బీఎస్పీ)కీ 464, రావు సుబ్రమణ్యం (నవతరం)కు 418, రత్నకుమారి తన్నీరు (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా)కు 97, ముకిరి రామకోటేశ్వరరావు (ఇండియన్ లేబర్ పార్టీ)కు 61, వినోద్‌కుమార్ దొప్పులపూడి (భారత చైతన్య యువజన పార్టీ)కు 28, షేక్ గౌస్ బాషా (రాష్ట్రీయ జన క్రాంతి పార్టీ) 28, స్వతంత్రులు ప్రత్తిపాటి పిచ్చియ్య 1,060, బహుజనక్ రాజేష్ 296, నల్లమోతు మాధవరావు 227, మనోహర్ దామర్ల 227, ప్రత్తిపాటి రవిబాబు 127, తమ్ములూరి రమణయ్య 67, పి.రహమ్‌తున్ 57, సాయి గణేష్ కొర్నెపాటి 56, తనుబొద్ది సుందరరామిరెడ్డి 44, సాంబశివరావు పొన్నెగంటి 39, గౌతమ్ కట్టా 39, రామిరెడ్డి మార్లెళ్ల 34, చెల్లి దయారత్నమ్ 34, వంతరి విజయకుమారి 28, కుమార్ శివరామ్ వినయ్ 27, కిరణ్ కుమార్ 22, నోటాకు 788 ఓట్లు రావడం గమనార్హం.
- నరసరావుపేట నియోజకవర్గంలో అరవింద్ బాబు చదలవాడ (ఎన్‌డీఏ కూటమి)కు 1,03,167, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి (వైఎస్సార్ సీపీ)కు 83,462, మహబూబ్ బాషా షేక్ (కాంగ్రెస్)1,820, బుద్దల శామ్యేలు(బీఎస్పీ) 828, గోదా జాన్‌పాల్ (జైభీమ్‌రావు భారత్ పార్టీ)182, గోగుల మనోహర్(భారత చైతన్య యువజన పార్టీ) 119, స్వతంత్రులు అనీల్ కుమార్ పాదరి 100, షేక్ మాలాలికీ 99, డాక్టర్ గోదా రమేష్‌కుమార్ 66, కూచిపూడి చంద్రోశేఖర్ 52, శ్రీరామినేని ప్రసాద్ 50, మహ్మద్ మంజూర్ షేక్ 47, కోటిరెడ్డి కుమ్మెత 39, తాళ్లపనేని హరికృష్ణ 34, నోటాకు 1,052 ఓట్లు వచ్చాయి.
- సత్తెనపల్లి నియోజకవర్గంలో కన్నాలక్ష్మీనారాయణ (ఎన్‌డీఏ కూటమి)కు 1,17,965, అంబటి రాంబాబుకు (వైఎస్సార్ సీపీ)కు 90,129, చుక్కా చంద్రపాల్ (కాంగ్రెస్)1,580, పేరుపోగు నవీన్‌బాబు(బీఎస్పీ) 647, జొన్నలగడ్డ విజయ్‌కుమార్ (జైభీమ్‌రావు భారత్ పార్టీ) 170, గోదా వెంకటరమణ(జాతీయ జనసేన పార్టీ) 119, యామోజీ హనుమంతురావు(యూగ తులసి పార్టీ) 107, రంగిశెట్టి నాగేశ్వరరావు (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా) 84, షేక్ దరియావలి(జై భారత్ నేషనల్ పార్టీ) 47, స్వతంత్రులు జక్రియ కందుకూరి 213, పాడి మణికంఠ 108, మేకల సుబ్బారావు 90, మేకల వేణుమాధవరెడ్డి 76, గద్దం రాంబాబు 63, పి.గోవింద రమేష్‌బాబు 28, నోటాకు 1,140 ఓట్లు వచ్చాయి.

పెదకూరపాడు నియోజకవర్గంలో భాష్యం ప్రవీణ్ (ఎన్‌డీఏ కూటమి)కు 1,12,957, నంబూరు శంకరరావు(వైఎస్సార్ సీపీ)కు 91,868, పమిడి నాగేశ్వరరావు(కాంగ్రెస్) 1,290, వరగాణి ఏడుకొండలు(బీఎస్పీ) 1,030, ఆలా రామకృష్ణారావు(భారత చైతన్య యువజన పార్టీ) 140, స్వతంత్రులు కళ్యాణ్ చక్రవర్తి నంబూరు 490, శెట్టి శింగారయ్య 101, బంకా తిరుపతిరావు 90, గౌతకట్ల అంకమ్మరావు 59, ప్రగతి రాజు 48, బాణావత్తు మురళీకృష్ణా నాయక్ 41, నోటాకు 1,184 ఓట్లు వచ్చాయి.

- వినుకొండ నియోజకవర్గంలో గోనుగుంట్ల వెంకట శివ సీతారామాంజనేయులు(ఎన్‌డీఏ కూటమి)కు 1,31,438, బొల్లా బ్రహ్మనాయుడు(వైఎస్సార్ సీపీ)కు 1,01,171, చెన్నా శ్రీనివాసరావు(కాంగ్రెస్) 1,902, మాసిపోగు ఏసోబు(బీఎస్పీ) 1,243, రమణ గద్దం (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా) 225, కూకట్లపల్లి ప్రసాద్ (జాతీయ చేతివృత్తుల ఐక్య వేదిక పార్టీ) 126, చిరంజీవి నాయక్(జై భారత్ నేషనల్ పార్టీ) 68, స్వతంత్రులు శ్రీనివాసరావు నరాలశెట్టి 335, షేక్ బాజీ 177, శ్రీనివాసరావు జడా 141, మొలకల సీతారామ్ 59, బచ్చు వెంకట రవికుమార్ 44, బొల్లా వీరాంజనేయులు 42, ఉప్పల చిన్న కాశయ్య 31, నోటాకు 1,694 ఓట్లు వచ్చాయి.
- మాచర్ల నియోజకవర్గంలో జూలకంటి బ్రహ్మారెడ్డి (ఎన్‌డీఏ కూటమి)కు 1,22,413, రామకృష్ణారెడ్డి పిన్నెల్లి (వైఎస్సార్ సీపీ)కు 89,095, గుణదల సైదులు(బీఎస్పీ) 2,427, రామచంద్రారెడ్డి యరమాల (కాంగ్రెస్) 2,237, బచ్చు వెంకటేశ్వర్లు (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా) 329, నవ్వులూరి శివారెడ్డి (జై భారత్ నేషనల్ పార్టీ) 214, ఎనుముల కేశవరెడ్డి (తెలుగు రాజాధికార సమితిపార్టీ) 105, స్వతంత్రులు వీఆర్ఎస్ సత్యనారాయణచారి మరోజు 528, షేక్ మాబు జాని 286, గోళ్ళ శ్రీనివాసరావు 172, ప్రసాద్ సూరా 148, డేగల సైదారాజు 135, కుందూరు వీరాంజనేయరెడ్డి 101, గుమ్మడి కోటేశ్వరరావు యాదవ్ 85, కొత్రా రాజేష్ 78, నోటాకు 1,746 ఓట్లు వచ్చాయి.
- గురజాల నియోజకవర్గంలో యరపతినేని శ్రీనివాసరావు (ఎన్‌డీఏకూటమి)కు 1,28,201, కాసు మహేష్‌రెడ్డి (వైఎస్సార్ సీపీ)కు 98,715, యల్లమందారెడ్డి తియ్యా గూర (కాంగ్రెస్) 2,156, నాగెండ్ల యెబు(బీఎస్పీ) 909, కనకం శ్రీనివాసరావు (నేషనల్ నవక్రాంతి పార్టీ) 159, శ్రీనివాసరావు నీరుమళ్ళ (అఖిల్ భారతీయ జన్ సంఘ్)157, జులురి రమేష్ (జై భీమ్‌రావుభారత్ పార్టీ) 120, శ్రీనివాసరావు గద్దం (ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి) 93, స్వతంత్రులు రామారావు కొయ్యా 232, బాదం వెంకటేశ్వరరెడ్డి 146, గంగవరపు మల్లమ్మకు 92, కొప్పరపు వెంకట పురుషోత్తమరావుకు 91, చేదిల నాగార్జునకు 87, నోటాకు 1,888 ఓట్లు వచ్చాయి.

గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవికి దేవానంద్ రాజీనామా

- వైఎస్ జగన్ ప్రోత్సాహంతో గ్రంథాలయాల అభివృద్ధికి కృషి
- రూ.20 కోట్ల మేరకు సెస్సు బకాయిలు వసూలు చేశాం



రాజీనామా పత్రాన్ని చూపుతున్న బత్తుల దేవానంద్

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవికి బత్తుల దేవానంద్ రాజీనామా చేశారు. శనివారం అరండల్‌పేటలోని జిల్లా గ్రంథాలయసంస్థలో పదవికి రాజీనామా చేసిన దేవానంద్ మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో వసతుల లేమితో కొట్టుమిట్టాడుతున్న గ్రంథాలయాలను సీఎం వైఎస్ జగన్ అభివృద్ధి చేశారన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా రెండేళ్ల మూడు నెలల పదవీ కాలంలో చేసిన అభివృద్ధి పనులు, గ్రంథాలయాల్లో పాఠకులకు మౌలిక వసతులను కల్పించేందుకు చేసిన కృషి సంతృప్తి ఇచ్చిందని అన్నారు. గుంటూరు నగరపాలకసంస్థతో పాటు వివిధ మున్సిపాలిటీల నుంచి సెస్సు బకాయిల రూపంలో రావాల్సిన రూ.20కోట్లను వసూలు చేయడంతో పాటు జిల్లావ్యాప్తంగా అన్ని గ్రంథాలయాల్లో పాఠకులు, పోటీ పరీక్షల శిక్షణార్థులకు అవసరమైన పుస్తకాలను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో రూ.10 లక్షల ఎమ్మెల్యే గ్రాంటు నిధులతో కంప్యూటర్లు ఏర్పాటు చేశామని, మరో రూ.10 లక్షలతో గురజాలలో కొత్తగా గ్రంథాలయాన్ని నిర్మించినట్లు వివరించారు. ఈసందర్భంగా రాజీనామా పత్రాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి. సుబ్బరత్నమ్మకు అందజేశారు.

టీకా.. చింత లేదిక!

- బాపట్ల జిల్లాకు 80 వేల హెచ్ఎస్ వ్యాక్సిన్ డోసులు
- ఇప్పటికే జిల్లాలో జబ్బవాపు వ్యాధికి 2400 డోస్‌లు అందజేత
- ఈటీ వ్యాక్సిన్ 4.30 లక్షల గొర్రెలకు అందజేత
- జిల్లాలో ప్రారంభమైన హెచ్ఎస్ టీకా కార్యక్రమం

పశువుల్లో సీజనల్ వ్యాధుల నివారణకు టీకాలు దోహదం



గొర్రెలకు ఈటీ టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారులు

బాపట్లటౌన్: నైరుతి రుతు పవనాలు వచ్చేశాయి.. తీరప్రాంతంలో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు పడుతుండగా.. మరికొన్ని ప్రాంతాల్లో జల్లులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. వర్షాకాలంలో సహజంగా పశువులకు సీజనల్ వ్యాధులు వస్తాయి. తొలకరి వర్షాలతో కొత్తగా పశుగ్రాసం మొలకెత్తుతుంది. ఈ మొలకెత్తిన పశుగ్రాసాన్ని తినడంతోపాటు సీజనల్‌గా ఆవులు, ఎద్దులు, గేదెలకు గొంతువాపు వ్యాధి, గొర్రెలు, మేకలు, పొట్టేళ్లకు చిటిక వ్యాధి వ్యాపించే అవకాశాలున్నాయి. వీటి నివారణకు పశుసంవర్ధశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఉచితంగా టీకా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

నల్లజాతి పశువుల్లో గొంతువాపు వ్యాధి..

నల్లజాతి పశువులైన గేదెలు, దున్నపోతుల్లో ప్రస్తుత సీజన్‌లో అధికంగా గొంతవాపు వ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి వ్యాపించిన పశువుల్లో గొంతు కింద భాగం వాపులు వస్తాయి. దీంతో పాటు ఊపిరితిత్తుల్లో నెమ్ము చేరుతుంది. తద్వారా పశువులకు ఊపిరి తీసుకోవడం ఇబ్బందిగా మారుతుంది. ఆయాసం, గురకతో పాటు తీవ్రమైన జ్వరంతో ఆహారం తీసుకోలేక మృత్యువాత పడే అవకాశాలు ఉంటాయి. ఇలాంటి లక్షణాలు కనిపించిన వెంటనే రక్త పరీక్షలు నిర్వహించడం ద్వారా వ్యాధి నిర్ధారణ చేసి చికిత్సలు అందించాల్సి ఉంటుంది. గొంతువాపు వ్యాధి నివారణకు తప్పని సరిగా టీకాలను వేయించుకోవాలి.

తెల్లజాతి పశువుల్లో జబ్బవాపు వ్యాధి...

ప్రస్తుత సీజన్‌లో తెల్లజాతి పశువులైన ఆవులు, ఎద్దులు, లేగదూడలకు జబ్బవాపు వ్యాధి వ్యాప్తిస్తుంది. ఈ వ్యాధి వ్యాపించిన పశువులకు జబ్బ, వెన్ను, తొడ తదితర కండగల శరీర భాగాల్లో నల్లటివాపు కనిపిస్తుంది. దీంతో పశువులకు జ్వరం రావడం, మేత మేయకపోవడం, కదలలేక పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలున్న పశువులకు వెంటనే చికిత్స చేయించాలి. సకాలంలో చికిత్స చేయించలేక పోతే పశువులు మరణించే అవకాశాలు ఉంటాయి. ఈ జబ్బవాపు వ్యాపించడానికి ముందు పశువులకు టీకా వేయించాలి.

టీకాలు ప్రారంభం..

జిల్లాలో ఆవులు, గేదెలు 4,03,694 ఉన్నాయి. వీటికి వ్యాధులు రాకుండా ముందస్తుగా వ్యాక్సిన్ వేసే కార్యక్రమంలో భాగంగా టీకా కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభించారు. ఇప్పటికే జిల్లాలో పశువులకు సంబంధించి 80 వేల హెచ్ఎస్ వ్యాక్సిన్ డోసులు వచ్చాయి. వీటిని జిల్లాలోని పశువుల వైద్యశాలలకు సరఫరా చేయటం జరుగుతుంది. ఇప్పటికే గొర్రెలకు సంబంధించి ఈటీ వ్యాక్సినేషన్ 4.30 లక్షల గొర్రెలకు అందించారు. వీటితోపాటు 2400 పశువులకు జబ్బవాపు వ్యాధికి సంబంధించిన టీకాలు అందించారు.

జిల్లాలోని పశువుల సమాచారం

నియోజకవర్గం	ఆవులు	గేదెలు	గొర్రెలు	మేకలు	పందులు	కోళ్లు
అద్దంకి	3658	87341	178129	19299	1251	63666
బాపట్ల	4195	68554	50931	10952	126	154663
చీరాల	1640	26844	33467	2723	151	44125
పర్చూరు	3676	50287	105939	8557	528	64226
రేపల్లె	6226	90187	44175	3997	468	269760
వేమూరు	2535	58551	14882	4462	695	179582
మొత్తం	21930	381764	427523	49990	3219	776022

టీకాలతోనే వ్యాధులు దూరం



వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో తెల్ల, నల్లజాతి పశువులతోపాటు జీవాల్లో అధికంగా వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఉన్నాయి. ముందుజాగ్రత్తగా పశువులకు, జీవాలకు తప్పకుండా టీకాలు వేయించాలి. పశు సంచార వాహ నంలో 20 రకాల పేడ సంబంధిత, 15 రకాల రక్తపరీక్షలు చేయడానికి మైక్రోస్కోప్‌తో కూడి న ప్రయోగశాలను వాహనంలో ఏర్పాటుచేశారు. పశువుల వ్యాధిని గుర్తించి తక్షణమే వైద్యం అందించే వెసులుబాటు ఉంటుంది.

– డి.హనుమంతరావు, జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి

ఆలోచింపజేసిన సాంఘిక నాటికలు



చంద్రప్రస్థం నాటికలోని ఓ సన్నివేశం



నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటికలోని సన్నివేశం

పొన్నూరులో తెలుగు రాష్ట్రాలస్థాయి నాటిక పోటీలు ప్రారంభం

పొన్నూరు: ప్రముఖ రంగస్థల నటుడు కుప్పిలి వెంకటేశ్వరరావు శత జయంతిని పురస్కరించుకుని పొన్నూరు కళాపరిషత్ ఆధ్వర్యంలో నిడుబ్రోలు జెడ్పీ హైస్కూల్లోని డాక్టర్ నన్నపనేని జ్ఞానేంద్రనాథ్ కళావేదికపై 23వ ఉభయ తెలుగు రాష్ట్రాలస్థాయి ఆహ్వాన నాటికల పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు గుంటూరు అభినయ ఆర్ట్స్ నిర్వహణలో ఇంద్రప్రస్థం నాటిక ప్రదర్శించారు. ప్రేమ అనేది సృష్టిలో గొప్పదే కానీ ఆ ప్రేమలు హర్షించే విధంగా ఉండాలే తప్ప అనాలోచితంగా వెర్రిగా ఉంటే జీవితం, విలువలు నాశనం అవుతాయనే విషయాన్ని నటన రూపంలో చూపించారు. గోపి సత్యప్రకాష్ రచనకు, ఎన్.రవీంద్రరెడ్డి దర్శకత్వం వహించారు. విజయవాడ మైత్రీ కళానిలయం నిర్వహణలో బంధం సాంఘిక నాటిక ప్రదర్శించారు. మనిషి జీవితం బంధంతో మొదలవుతుంది.. ఆ బంధం కారణంగా కుటుంబంలో జరిగే పరిణామాలు, ప్రేమానురాగాలను తెలియజేస్తూ తమ నటనతో కళాకారులు ప్రేక్షకుల మన్ననలు పొందారు. మాడుగుల రామకృష్ణ రచనకు, టి.వి.పురుషోత్తం దర్శకత్వం వహించారు. విశాఖపట్నం తెలుగు కళాసమితి నిర్వహణలో నిశ్శబ్దమా నీ ఖరీదెంత సాంఘిక నాటికను ప్రదర్శించారు. అనాదిగా కుటుంబ వ్యవస్థను మెరుగు పరచేందుకు చట్టంలో అనేకమార్పులు చేస్తున్నారు. ఆ మార్పులు కష్టాలు అనుభవిస్తున్న వారికి ఎంతవరకు ఉపశమనం కల్పిస్తున్నాయనే సందేశాన్ని కళాకారులు అద్భుతంగా ప్రదర్శించి ప్రేక్షకులను ఆలోచింపచేశారు. పి.టి.మాధవ్ రచనకు, చలసాని కృష్ణప్రసాద్ దర్శకత్వం వహించారు. అనంతరం కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.శివకుమార్, డాక్టర్ కీర్తి, లయన్ సూరా రామారావు, పి.నిర్మల పాల్గొన్నారు. సంస్థ అధ్యక్షుడు ఎస్.ఆంజనేయులు నాయుడు, గౌరవాధ్యక్షుడు నన్నపనేని రఘునాథ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆకుల సాంబశివరావు, ఉపాధ్యక్షులు ఎస్.శివకుమార్, కోటేశ్వరరావు, కార్యదర్శి సీహెచ్‌వీ రామకృష్ణారావు పర్యవేక్షించారు.

వాగులో దిగి ఇద్దరు బాలురు మృతి

- గేదెలు మేపుకొంటూ వెళ్లి పక్కనే ఉన్న వాగులో ఈతకు దిగిన వైనం
- లింగంగుంట్ల ఎస్సీ కాలనీలో విషాదం



ఈశ్వరయ్య మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు



మృతిచెందిన ప్రసంగి

పెదకూరపాడు: గేదెలు కాసేందుకు వెళ్లి పక్కనే ఉన్న వాగులో ఈతకు దిగి ఇద్దరు బాలురు మృతిచెందిన సంఘటన పెదకూరపాడు మండలం లింగంగుట్ల గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన సారెకుప్ప నీలాంబరం, నాగమణి దంపతుల పెద్ద కుమారుడు సారెకుప్ప ఈశ్వరయ్య (14) సిరిపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి పూర్తి చేసి, పదో తరగతిలో చేరాల్సి ఉంది. ఇదే కాలనీకి చెందిన కుక్కళ్ల ఏసుదాసు, కోటేశ్వరమ్మల చిన్న కుమారుడు కుక్కళ్ల ప్రసంగి (16) పదో తరగతి పూర్తి చేశాడు. ఇరువురు తమ గేదెలను లింగంగుంట్ల రైల్వే ట్రాక్ సమీపంలోని పొలాల్లోకి తోలి, పక్కన ఉన్న వాగులో ఈతకు దిగారు. వాగులో పూడిక అధికంగా ఉండటంతో పూడికలో కూరుకుపోయారు. కుటుంబ సభ్యులు ఫోన్ చేస్తున్నప్పటికీ స్పందించకపోవడంతో సాయంత్రం 4 గంటల సమయంలో విద్యార్థులను వెతుక్కుంటూ పొలాల వైపు వెళ్లగా వాగు ఒడ్డుపై దుస్తులు, ఫోన్‌ను గుర్తించి వాగులో దిగారు. వాగులో కూరుకుపోయిన ఈశ్వరయ్య, ప్రసంగిలను వెలికి తీశారు. వెలికి తీసిన వెంటనే అప్పటికే మృతిచెంది ఉంటారని భావించి ఇళ్లకు తీసుకెళ్లారు. స్థానిక ఆర్ఎంపీ వైద్యుడు ప్రసంగిని పరీక్షించి శ్వాస ఉందని భావించి పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం ఈశ్వరయ్యను కూడా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఇద్దరూ మృతిచెందినట్లు నిర్ధారించారు. ఇద్దరు బాలుర మృతితో లింగంగుంట్ల ఎస్సీ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బైక్‌లు, ఆటోలే దిక్కయ్యాయి..

వాగులో పడిన వారిని ఇంటికి తరలించిన సమయంలో శ్వాస ఆడుతున్నట్లు గమనించిన కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేయగా వాహనం అందుబాటులో లేకపోవడంతో ఈశ్వరయ్యను ద్విచక్రవాహనంపై, ప్రసంగిని ఆటోలో ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న పెదకూరపాడుకు తరలించారు. సరైన సమయంలో 108 వాహనం వచ్చి ఉంటే తమ పిల్లలు బతికేవారని కుటుంబ సభ్యులు, స్థానికులు రోదించారు.

నేటి నుంచి జాతీయ నాటకోత్సవాలు

చీరాల అర్బన్: కళాంజలి, చీరాల సాంస్కృతిక మిత్రమండలి ఆధ్వర్యంలో 7వ తెలుగు రాష్ట్రాల జాతీయ నాటకోత్సవాలను ఆదివారం నుంచి 13వ తేదీవరకు స్థానిక కస్తూర్బా గాంధీ బాలికోన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు కళాంజలి కార్యవర్గ సభ్యులు శనివారం తెలిపారు. ప్రతి సంవత్సరం ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో అనేక పరిషత్‌లలో ఉత్తమ నాటక ప్రదర్శనలుగా నిలిచిన పలు నాటికలను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. గత ఆరు సంవత్సరాలుగా నాటకోత్సవాలను నిర్వహిస్తున్నామని, ప్రతిరోజు సాయంత్రం రెండు నాటికలతో పాటు ఏకపాత్రాభినయం, నృత్య ప్రదర్శన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. డాక్టర్ పోలవరపు వెంకటేశ్వరప్రసాద్ కళాప్రాంగణంలో జరిగే నాటకోత్సవాల్లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాంజలి గౌరవాధ్యక్షుడు మామిడాల రాములు, అధ్యక్షుడు కోడూరి ఏకాంబరేశ్వరబాబు, ఉపాధ్యక్షులు వలివేటి మురళీకృష్ణ, డాక్టర్ గుంటుపల్లి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి తిరుమలశెట్టి సాంబశివరావు, సంయుక్త కార్యదర్శి బత్తుల బ్రహ్మారెడ్డి, కోశాధికారి షేక్ దరియా సాహెబ్, కార్యవర్గ సభ్యులు పొట్టి శ్రీనివాసరావు, నక్కా వీరబ్రహ్మం, వల్లభనేని మాధవరావు, వడలి రాధాకృష్ణ, మెడబలిమి లూకా, సమన్వయకర్తలు పూర్ణా సత్యం, బీరం సుందరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘర్షణలకు కారణమైన నలుగురి అరెస్టు

క్రోసూరు: మండలంలోని పీసపాడు గ్రామంలో ఎన్నికల కౌంటింగ్ రోజున ఘర్షణలకు కారణమైన నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎం.షఫీ శనివారం తెలిపారు. ఎవరైనా అల్లర్లకు పాల్పడినా, అసాంఘిక చర్యలకు పాల్పడినా, సోషల్ మీడియా, ఇన్స్టాగామ్, స్టేటస్‌లలో అసభ్య పోస్టింగులు పెట్టినా, వ్యక్తిగతంగా, పార్టీల పరంగా, కులాలను, మతాలను దూషిస్తూ పోస్టింగులు పెట్టినా క్రిమినల్ కేసులు పెట్టటం, రౌడీషీట్‌లు తెరవటం జరుగుతుందని ఎస్ఐ హెచ్చరించారు.

డీసీఎంఎస్ డైరెక్టర్ పదవికి రాజు రాజీనామా



తాడికొండ: డీసీఎంఎస్ డైరెక్టర్ పదవికి రాజీనామ చేస్తున్నట్లు దాసరి రాజు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పదవులు ముఖ్యం కాదని, మాకు పార్టీయే ముఖ్యమని కష్టమైనా, సుఖమైనా వైఎస్సార్ సీపీలో ఉండి మళ్లీ పార్టీని 175 స్థానాల్లో గెలిపించుకుంటామని పేర్కొన్నారు. కూటమి పేరుతో అన్ని పార్టీలు కలిసి ఒక్కడిపై పోటీ చేస్తే సాధించింది కేవలం 1.80 కోట్ల ఓట్లయితే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఒక్కరే పోటీ చేసి 1.30 కోట్ల ఓట్లు సంపాదించాడంటే అది ఆయనకు ప్రజల్లో ఉన్న ఆదరణకు నిదర్శనం అన్నారు. ఓటమికి గెలుపునకు మధ్య 6 శాతం మాత్రమే తేడా ఉందని, గెలుపును చూసి కూటమి పొంగి పోకుండా ప్రజలకు మంచి చేయాలని, కానీ కక్ష్య సాధింపు చర్యలకు పోయి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే ప్రజల చేతిలో చావుదెబ్బ తప్పదని హెచ్చరించారు. తాడికొండలో మేకతోటి సుచరిత నాయకత్వంలో పనిచేసి ఈ ప్రాంతంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండాను ఎగరేసి సత్తా చాటుతామని చెప్పారు.

అభివృద్ధికి నా వంతు సహకారం అందిస్తా..

- దాడులు, ధ్వంసాలు విడనాడి అభివృద్ధిపై దృష్టి పెట్టాలి
- ఎమ్మెల్యే అరవిందబాబుకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి సూచన



నరసరావుపేట: నియోజకవర్గ అభివృద్ధిలో తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం ఎన్నికల అనంతరం తొలిసారిగా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దాడులు, ధ్వంసాలు వదిలేసి, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు గుర్తు చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు ప్రజలు బాధ్యత అప్పగించారని, దాడులకు తావు ఇవ్వకుండా పార్టీ కార్యకర్తలను నియంత్రించి అందరూ సమన్వయంగా ప్రశాంతమైన వాతావరణం కల్పించాలని కోరారు. ప్రతి గ్రామంలో శాంతి కమిటీలను ఏర్పాటు చేసి హింసాత్మక ఘటనలు జరగకుండా వ్యవహరించాలని సూచించారు. నియోజకవర్గ ప్రజలకు సేవ చేసేందుకు మరోసారి అవకాశం ఇస్తారని భావించానని, అయితే ప్రత్యేక పరిస్థితుల కారణంగా ఆ అవకాశం దక్కలేదన్నారు. విద్యా, వైద్యానికి ప్రత్యేక ప్రాధాన్యమిస్తూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 70 శాతం మంది ప్రజలకు మేలు చేసే పథకాల అమలుతో మళ్లీ పార్టీ అధికారంలోకి వస్తుందని తామందరమూ భావించినట్లు వివరించారు. ప్రజలు దీనికి భిన్నమైన తీర్పు ఇచ్చారన్నారు. ప్రజాతీర్పును స్వాగతిస్తున్నామని చెప్పారు. గెలిచిన కూటమి నాయకులైన నరేంద్ర మోదీ, నారా చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్‌లతో పాటు ఎంపీ, ఎమ్మెల్యేలకు తన శుభాకాంక్షలు తెలిపారు. ఫలితాలను చూసి వైఎస్సార్ సీపీ శ్రేణులు అధైర్యపడాల్సిన అవసరం లేదని అన్నారు. ఏ కష్టం వచ్చినా అందరికీ అందుబాటులో ఉంటానని చెప్పారు. అందరూ సంయవనం పాటించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దాడులు, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం లాంటి వాటిపై జిల్లా ఎస్పీని కలసి మాట్లాడామన్నారు. కష్టాలు, అడ్డంకులు ఎదుర్కొని పార్టీ కోసం, తన విజయం కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

ప్రజా తీర్పును గౌరవిస్తాం..

- సమర్థంగా ప్రతిపక్షపాత్ర పోషిస్తాం..
- కార్యకర్తలు, నాయకులు అధైర్యపడొద్దు..
- పల్నాడులో హింసకు తావులేదు
- దాడులపై జిల్లా ఎస్పీని కలుస్తాం
- మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి: ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పును గౌరవిస్తామని, ప్రజలు ఇచ్చిన ప్రతిపక్ష పాత్రను సమర్థంగా నిర్వర్తిమని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజలు టీడీపీని అధికారంలోకి తీసుకువచ్చి వైఎస్సార్ సీపీకి ప్రతిపక్షం అప్పగించారని, దీన్ని అందరూ ఆమోదించాలని పేర్కొన్నారు. గురజాల నియోజకవర్గ ప్రజలు నాకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించటంతో ఐదేళ్లు ఎన్నో మంచి పనులు ప్రజలకు చేయగలిగామని, రూ.600 కోట్లతో ప్రభుత్వ మెడికల్ కళాశాల, బైపాస్ నిర్మాణం, 30 వేల మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాలు, ఇళ్లు, ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీరు, రోడ్ల విస్తరణ పనులు, దాచేపల్లి, గురజాలను మున్సిపాలిటీలుగా చేయటంతో పాటు మరెన్నో అభివృద్ధి, సంక్షేమం పనులు చేశామని ఆయన వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని, గెలిస్తే వీర్ర వీగటం.. ఓడిపోతే కుంగిపోవటం నా రాజకీయ చరిత్రలో లేవని, అధికారం ఉన్న లేకపోయిన ఎప్పుడు ఒకే రకంగా ఉంటూ ప్రజలతో మమేకం అవుతామని ఆయన అన్నారు. వైఎస్సార్ సీపీ ఓటమిపై నెల రోజుల వ్యవధిలో కార్యకర్తలు, నాయకులతో సమీక్ష చేస్తామని, ఏలా ఓడిపోయాం.. ఎందుకు ఓడిపోయాం అనే దానిపై సుదీర్ఘంగా చర్చిస్తామని మాజీ ఎమ్మెల్యే కాసు చెప్పారు.

హింసకు తావులేదు..

పల్నాడు ప్రాంతంలో హింసకు తావులేదని మాజీ ఎమ్మెల్యే కాసు అన్నారు. కొన్ని గ్రామాల్లో ఘర్షణలు జరుగుతున్నాయని, తక్షణమే పోలీసులు వీటిని ఆపాలని కోరారు. జిల్లాలోని నాయకులంతా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై జరుగుతున్న దాడులపై జిల్లా ఎస్పీని కలుస్తామని, దాడులపై అన్ని ఆధారాలను అందజేస్తామని వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు ఎక్కడ అధైర్యపడొద్దని, అందరం కలిసిమెలసి ఉండి జగనన్నని మరోసారి సీఎం చేసేందుకు కష్టపడి పనిచేద్దామని మాజీ ఎమ్మెల్యే కాసు పిలుపునిచ్చారు. ఓటమిపై కారణాలు తెలుసుకుని వాటిని అధిగమించేందుకు నిబద్ధత కలిగిన కార్యకర్తలు, నాయకుల్లా పనిచేద్దామని ఆయన కోరారు.

అరుదైన వ్యాధికి చికిత్స



వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ బాలినేని సాయికృష్ణ

గుంటూరు మెడికల్: సైటస్ ఇన్వర్సెస్ విత్ డెక్స్ట్రోకార్డియా అనే అరుదైన జబ్బుతో బాధపడుతున్న 16 ఏళ్ల బాలికకు ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స చేసి వ్యాధి నుంచి విముక్తి కలిగించినట్లు శ్రీప్రతిమ సూపర్ స్పెషాలిటీ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ బాలినేని సాయికృష్ణ చెప్పారు. శనివారం స్థానిక గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని హాస్పిటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పెదకూరపాడు మండలం లింగంగుంట్ల గ్రామానికి చెందిన సారెకొప్పుల మేరి, ఓంకారయ్య దంపతుల కుమార్తె ఎస్తేరు రాణి కుడివైపు గుండెతో జన్మించింది. సాధారణంగా అందరికి ఎడమవైపు గుండె ఉంటుంది. బాలికకు గుండెతో పాటు శరీరంలో ఇతర అవయవాలు అందరికి ఉండే మాదిరిగా కాకుండా వ్యతిరేకంగా ఉన్నాయి. కొంత కాలంగా బాలిక తీవ్ర కడుపునొప్పితో బాధపడుతూ గతనెల 14న తమ హాస్పిటల్‌కు వచ్చినట్లు డాక్టర్ సాయికృష్ణ చెప్పారు. వైద్య పరీక్షలు చేసి ప్యాంక్రియాటీస్ సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించి చికిత్స చేశామన్నారు. మళ్లీ ఈనెలలో అనారోగ్యంతో తమ వద్దకు రాగా, వైద్య పరీక్షలు చేసి పసరుతిత్తిలో రాళ్లు ఉండి, అవి కిందకు జారిపోవడం వలన తీవ్రమైన కడుపు నొప్పి వస్తున్నట్లు గుర్తించామన్నారు. గుంటూరులో మొట్టమొదటిసారిగా ఎండోస్కోపి ద్వారా ఈఆర్‌సీపీ చికిత్స చేసి గురువారం లివర్‌కు స్టంట్ వేశామన్నారు. సుమారు రూ.2 లక్షల ఖరీదు చేసే ఆపరేషన్‌ను ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేశామన్నారు. సాధారణంగా మెట్రోపాలిటన్ ప్రాంతాల్లో మాత్రమే ఇలాంటి చికిత్స అందుబాటులో ఉంటుందని, తమ ఆస్పత్రిలో గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో అన్ని రకాల ఆధునిక చికిత్సలు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్య పరిస్థితి బాగుండటంతో డిశ్చార్జి చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



బాపట్లటౌన్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని అప్పికట్ల సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని గాదె వెంకటరెడ్డి కాలనీకి చెందిన తిరుపీధుల అంకమ్మరావు, పవన్‌కుమార్ ఇద్దరు ద్విచక్ర వాహనంపై పొన్నూరు వెళ్తున్నారు. అప్పికట్ల సమీపంలోని యారకాలువ సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి పక్కనే ఉన్న చెట్టుకు ఢీ కొట్టారు. ఈ ఘటనలో ద్విచక్ర వాహనం నడుపుతున్న పవన్ కాలుకు తీవ్రగాయాలు కాగా, బైక్‌పై వెనుక కూర్చున్న అంకమ్మరావు తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. అప్పటికే అంకమ్మరావు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తల్లి వెంకాయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ సీఐ శ్రీహరి కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు



ప్రిన్సిపాల్ పాపయ్య

జెట్టిపాలెం(రెంటచింతల): స్థానిక ఆదర్శ పాఠశాల(ఏపీ మోడల్ స్కూల్)లో 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి 6 నుంచి 9వ తరగతులలో ప్రవేశానికి ఈ నెల 14వ తేదీ సాయంత్రం 4 గంటల లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె.పాపయ్య కోరారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో వివరాలు వెల్లడించారు. దరఖాస్తులను పాఠశాలలో నేరుగా అందచేయాలన్నారు. ఆంగ్లంలో ఉచితంగా విద్యా భోదన జరుగుతుందన్నారు. 6, 7, తరగతులు స్టేట్ సిలబస్, 8, 9 తరగతులు సెంట్రల్ సిలబస్ ఉంటుందన్నారు. 2024–25 విద్యా సంవత్సరంలో ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం ఖాళీలకు ప్రవేశాలకు ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులలో చేరేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆంగ్లంలో భోదన ఉంటుందని ఎటువంటి ఫీజులు వసూలు చేయబడవన్నారు. 6 తరగతిలో 35 ఖాళీలు, 7 వ తరగతిలో 40 ఖాళీలు, 8 వ తరగతిలో 25 ఖాళీలు, 9 వ తరగతిలో 35 ఖాళీలు, ఇంటర్ ఫస్టియర్‌లో 40 ఖాళీలు, ఇంటర్ సెకండ్ ఇయర్‌లో 50 ఖాళీలు ఉన్నాయన్నారు. పూర్తి వివరాలకు పాఠశాలలో ప్రిన్సిపాల్ 9182958496 ను సంప్రదించాలని కోరారు.

పల్లెల్ని వల్లకాడు చేస్తున్న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు

పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు పల్లెల్ని వల్లకాడు చేస్తున్నాయని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ అన్నారు. శనివారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడారు. పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం కొండూరులో ఎన్నికల ఫలితాలు ఒక వైపు వస్తుంటే మరోవైపు టీడీపీ శ్రేణులు మాదిగ పల్లెలో వీరంగం సృష్టించినట్లు చెప్పారు. మహిళలు, పిల్లలను, వృద్ధులను వదలకుండా పచ్చి బూతులు, కులం పేరుతో దూషించారని ఆరోపించారు. ఇంట్లో ఎవరూ లేకుంటే సామాన్లు పగల కొట్టి, ఇళ్లను ధ్వంసం చేస్తుండగా సీఐ, పోలీసుల ఎదురుగానే ఉన్నారని చెప్పారు. ఇంట్లో తలుపులు వేసుకున్న వారిని సీఐనే బయటకు పిలిపించమని, లేకుంటే తలుపులు పగలగొట్టి చంపుతామని వార్నింగ్ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ విధంగా సుమారు వంద ఇళ్లను ధ్వంసం చేశారని తెలిపారు. దాడికి గురైన వారిపై పెట్టిన అక్రమ కేసును వెంటనే ఎత్తివేయాలని, దాడి చేసిన అందరిపైన కేసు నమోదు చేయాలని, దెబ్బలు తగిలిన అందరికీ వైద్యం అందించాలని, ప్రతి ఇంట్లో జరిగిన నష్టాన్ని నమోదు చేయాలని, పోలీస్ నిఘా పెంచాలని ఆయన కోరారు.

దేవదాయ భూముల కౌలు హక్కుల వేలం



వేలంలో పాల్గొన్న రైతులు

కారంచేడు: కారంచేడు గ్రామానికి చెందిన దేవాలయాల భూముల కౌలు హక్కుల వేలం శనివారం నిర్వహించినట్లు దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వేణుగోపాలరావు తెలిపారు. స్థానిక దేవదాయశాఖ కార్యాలయం వద్ద నిర్వహించిన వేలం నిర్వహించినట్లు చెప్పారు. 2024- 25 సంవత్సరానికి దేవదాయ భూములను సాగు చేసుకొనేందుకు వేలం నిర్వహించామన్నారు. ఈ వేలంలో మాధవస్వామివార్ల దేవస్థానానికి చెందిన 38.85 ఎకరాల సాగు భూమికి గత ఏడాది రూ.7.50 లక్షలకు వేలం జరిగిందన్నారు. అదే భూములకు ఈ ఏడాది రూ 10.76 లక్షకు వేలం పాట జరిగిందన్నారు. మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థాన భూముల్లైన 16.29 ఎకరాల సాగుభూమికి గత ఏడాది రూ 3.18లక్షలు వేలం జరగగా, ఈ ఏడాది అదే సాగు భూమికి రూ 5.64 లక్షల వేలం జరిగిందన్నారు. ఈ వేలం పాటలకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు 70 మందికి పైగా కౌలు రైతులు వేలం పాటల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈఓ పోతిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అమెరికా ఉద్యోగాల పేరుతో మోసం!

పెనమలూరు: అమెరికాలో మంచి ఉద్యోగాలు ఇప్పిస్తానని ఓ వ్యక్తి పలువురిని మోసం చేసి రూ.15.60 లక్షలు స్వాహా చేసి పరారైన ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురుకు చెందిన షేక్ రిజ్వాన గతేడాది గన్నవరంలో మామయ్య ఇంట్లో జరిగిన ఫంక్షన్‌కు వెళ్లారు. అక్కడ తాడిగడప నిమ్రా కాలనీకి చెందిన సాహెల్‌ఫర్వేజ్‌ఖాన్ పరిచయమయ్యాడు. అతను అమెరికాలో పలురకాల ఉద్యోగాలు ఇప్పిస్తానని ఆమెను నమ్మబలికాడు. దీంతో ఆమె రూ.2 లక్షలు అతనికి ఇచ్చింది. మండల పరిధిలోని ఎండీ ఖాజా రూ.లక్ష, సోహెల్ రజాక్ రూ.2.60 లక్షలు, షేక్ గఫర్ రూ.3 లక్షలు, బత్తుల నూకరత్నం రూ.3 లక్షలు, అబ్దుల్ రజాక్ రూ.4 లక్షల చొప్పున మొత్తం 15.60 లక్షలు సాహెల్‌ఫర్వేజ్‌ఖాన్‌కు ఇచ్చారు. గతేడాది డిసెంబర్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు బాధితులు అతనికి సొమ్ము ముట్టచెప్పారు. ఈ ఏడాది మే 29న హైదరాబాద్ బేగంపేటలో ఉన్న ఫయిద్దీన్‌ఖాన్ వద్దకు అందరు వెళ్లాలని అక్కడ జూన్ 7వ తేదీ వరకు శిక్షణ ఉంటుందని, జూన్ 10వ తేదీన ఫ్లైట్ టికెట్‌లు బుక్ అవుతాయని అతను నమ్మించాడు. హైదరాబాద్‌కు వెళ్లటానికి ఖర్చుకు తలా రూ.6 వేలు అదనంగా ఇచ్చారు. మే 25వ తేదీన బాధితులు హైదరాబాద్‌కు బయలుదేరటానికి సిద్ధంగా ఉన్నామని తెలియచేయడానికి సాహెల్‌ఫర్వేజ్‌ఖాన్‌కు ఫోన్ చేయగా అతని స్విచ్చాఫ్ వచ్చింది. బాధితులు తాడిగడప నిమ్రా కాలనీలోని అతని ఇంటికి వెళ్లగా ఇల్లు ఖాళీ చేశాడని తెలిపారు. బాధితులు తాము మోసపోయామని పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



రేపల్లె రూరల్: కానిస్టేబుల్ వేధిస్తున్నాడంటూ ఒకరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలు.. మోర్లవారిపాలేనికి చెందిన బొర్రా శివరామకృష్ణను అదే గ్రామానికి చెందిన రేపల్లె పట్టణ పట్టణ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న యార్లగడ్డ సోమశేఖర్ పాత కక్షలు మనస్సులో పెట్టుకుని రెండు నెలలుగా వేధిస్తున్నాడని వాపోయాడు. తనపై ఎటువంటి కేసులు పెట్టకుండానే విచారణ పేరుతో పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి పోలీసు అధికారుల ముందే తనపై దాడి చేయటంతో పాటు చెప్పుకోలేని రీతిలో దుర్భషలాడాడన్నారు. అధికారంలోకి వచ్చింది తనకు అనుకూల ప్రభుత్వమేనని, ఐదు సంవత్సరాలు తనను ఇక్కడి నుంచి ఎవరూ కదపలేరని, నీ అంతు చూస్తాననటమేకాకుండా, తన భార్య, తల్లి ఇరువురిని అసభ్యపదజాలంతో మాట్లాడటం మనస్సు కలచివేసిందన్నారు. నిన్ను చంపినా అడిగే దిక్కు లేదంటూ దాడికి పాల్పడ్డాడని బోరున రోధించాడు. భయంతో పోలీసు స్టేషన్ నుంచి పరారై భట్టిప్రోలులో విషగుళికలు కొనుగోలు చేసి పల్లెకూన సమీపంలో వాటిని తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు చెప్పారు. చివరిగా తాను విషగుళికలు తిన్నట్లు కుటుంబ సభ్యులకు ఫోను ద్వారా సమాచారం అందజేసినట్లు బాధితుడు తెలిపాడు. గమనించిన స్థానికులు శివరామకృష్ణను రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకు గుంటూరు తరలించారు. ఈ విషయమై పట్టణ సీఐ నజీర్‌బేగ్‌ను వివరణ కోరగా శివరామకృష్ణ అదే గ్రామానికి చెందిన సోమశేఖర్ కుటుంబ సభ్యులను దూషించటంతో విచారణ నిమిత్తం స్టేషన్‌కు తీసుకురావటం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో శివరామకృష్ణ భయాందోళనలకుగురై విషగుళికలు తీసుకున్నాడన్నారు.